క్లుప్తంగా

సమాచార హక్కు చట్టంపై అవగాహన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న సహకార అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): పరిపాలనలో పారదర్శకతను పెంపొందించేందుకు ఉద్దేశించిన సమాచార హక్కు చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా సహకార అధికారి వెంకటకృష్ణ తెలిపారు. సోమవారం సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తూ నగరంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీసీఓ మాట్లాడుతూ.. పౌరులు అడిగే సమాచారాన్ని నిర్ణీత గడువులోపు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. పరిపాలన పారదర్శకత కోసం ఈ చట్టం అమలులోకి వచ్చిందని, దీన్ని దుర్వినియోగం చేయడానికి ప్రయత్నించరాదన్నారు. ప్రజలకు ఉపయోగపడే సమాచారం ఇచ్చేందుకు సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. డీఎల్‌సీవో షేక్ జాఫ్రీన్, సబ్ డివిజన్ సహకార అధికారి నాగరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు బ్రాహ్మణ సేవా సంఘం సమావేశం


మాట్లాడుతున్న బ్రాహ్మణ నేతలు

కర్నూలు(అర్బన్): బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య సర్వసభ్య సమావేశం ఈ నెల 19వ తేదీన ఉదయం 10 గంటలకు స్థానిక పెద్ద మార్కెట్ సమీపంలోని శ్రీ లక్ష్మినరసింహ స్వామి కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి హెచ్‌కే మనోహర్‌రావు తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా బ్రాహ్మణ నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనలో భాగంగా జాబ్‌మేళాలు నిర్వహించడం, వివాహ పరిచయ వేదికలు నిర్వహించడం తదితర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. అలాగే శ్రావణ మాసం చివరి మంగళవారం పురస్కరించుకొని ఉదయం 8 గంటలకు మహిళలచే సామూహిక గౌరీ వ్రతం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారన్నారు. నగరంలోని బ్రాహ్మణులందరూ హాజరు కావాలని కోరారు. బ్రాహ్మణ నేతలు ఇస్కాల సురేష్‌కుమార్, కల్లె చంద్రశేఖరశర్మ, హెచ్‌కే రాజశేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ దుకాణంలో అగ్నిప్రమాదం


అగ్నిప్రమాదంలో కాలి బూడిదైన కంప్యూటర్ల విడి భాగాలు, ఫర్నీచర్

కర్నూలు: కర్నూలు బిర్లా కాంపౌండ్‌లోని శశికాంత్ ప్లాజాలో ఉన్న సువర్ణ కంప్యూటర్స్ సేల్స్ దుకాణంలో ఆదివారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కంప్యూటర్ యాక్సెసరీస్, ఫర్నీచర్, కంప్యూటర్ విడి భాగాలు కాలి బూడిదయ్యాయి. దుకాణంలో అనుమానాస్పద రీతిలో అగ్నిప్రమాదం జరిగిందని నిర్వాహకుడు కొళాయి పెద్దయ్య వాపోయారు. విషయం తెలిసిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకునే లోపు ఆలస్యం కావడంతో అప్పటికే పరికరాలన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు రూ.30 లక్షల దాకా ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు ఫిర్యాదు చేశారు.

ఫిలాటెలీ స్కాలర్‌షిప్ పరీక్ష

కర్నూలు (అర్బన్): విద్యార్థులకు స్టాంపుల సేకరణపై అవగాహన కల్పించేందుకు పోస్టల్ శాఖ ఎన్నో రకాల కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా 'దీన్ దయాళ్ స్పర్శ్ యోజన' (డీడీఎస్‌వై) అనే స్కాలర్‌షిప్ పరీక్షను సెప్టెంబర్ నెలలో నిర్వహించనున్నట్లు కర్నూలు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 6వ తరగతి నుంచి 9వ తరగతి చదివే విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. పరీక్షలో ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.6 వేలు స్కాలర్‌షిప్ అందించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల విద్యార్థులు వ్యక్తిగతంగా కానీ తమ స్కూల్ ప్రిన్సిపాల్ ద్వారా కానీ 'ఫిలాటెలీ డిపాజిట్ ఖాతా'ను రూ.200తో కర్నూలు ప్రధాన తపాలా కార్యాలయంలో తెరిచి ఆ వివరాలను అప్లికేషన్‌కు జతపరచి ఒక కవరులో సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, కర్నూలు డివిజన్, కర్నూలు 518001 అడ్రసుకు పంపాలని సూచించారు. కవరుకు ఫిలాటెలీ స్టాంప్‌ను అతికించి స్పీడ్ పోస్టు ద్వారా మాత్రమే పంపాలని, సెప్టెంబర్ 16 చివరి తేదీ అని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కర్నూలు సూపరింటెండెంట్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

జాతీయ స్థూపం ఆవిష్కరణ


కలెక్టరేట్ వద్ద జాతీయ చిహ్నాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లో ఆధునికీరించిన వివిధ పనులను కలెక్టర్ పి.రంజిత్‌బాషా సోమవారం ప్రారంభించారు. కలెక్టరేట్ సుందరీకరణలో భాగంగా మెయిన్ గేటు వద్ద జాతీయ చిహ్నం సర్కిల్, ఫౌంటెన్‌తో కూడిన పార్కు, సువిధ కాంప్లెక్స్‌లను ఆయన ప్రారంభించి అధికారులు, ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలకు అనువుగా సువిధ కాంప్లెక్స్‌ను నిర్మించినట్లు చెప్పారు. జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వర రెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, పీఆర్ ఎస్ఈ మద్దన్న, డీపీఓ భాస్కర్ పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

జిల్లాలో విస్తృతంగా వర్షాలు కురుస్తుండటంతో దోమల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో దోమల నివారణపై అవగాహన పోస్టర్‌ను కలెక్టర్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది మలేరియాపై పోరాటాన్ని ఉధృతం చేయడం కోసం ప్రపంచ దోమల నివారణ దినోత్సవం జరుపుకుంటున్నట్లు చెప్పారు. దోమలు కుట్టడంతో వచ్చే మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. మండల స్థాయి అధికారులు పర్యటనలకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య పనులను పక్కాగా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. పారిశుద్ధ్యం, నీటి ట్యాంకుల క్లీనింగ్, క్లోరినేషన్ ప్రక్రియలను నిరంతరం చేపట్టాలన్నారు. 0 – 5 సంవత్సరాల పిల్లలు, గర్భిణులకు జ్వరం వస్తే ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లాలని ఐసీడీస్ అధికారులను ఆదేశించారు. జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ, మలేరియా నియంత్రణ అధికారి నూకరాజు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించండి


కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న మత్స్యకార సంఘం నాయకులు

కర్నూలు(అర్బన్): మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జాతీయ మత్స్యకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోస అప్పలరాజు కోరారు. సోమవారం ఇక్కడకు వచ్చిన ఆయన స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని చేపల మార్కెట్‌ను సందర్శించి మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలోనే సంఘం జిల్లా అధ్యక్షులు బెస్త శ్రీనివాసులు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలిసి వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా మత్స్యకారుల పిల్లల విద్యాభివృద్ధికి ప్రత్యేక గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. కుంటలు, చెరువులు, రిజర్వాయర్లలో పట్టుకున్న చేపలను విక్రయించుకునేందుకు కర్నూలు నగరంలో మోడ్రన్ చేపల మార్కెట్‌కు స్థలం కేటాయించి నిర్మాణం చేపట్టాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో ఉన్న విధంగానే చెరువులు, కుంటలు, రిజర్వాయర్లకు సంబంధించి ప్రభుత్వానికి చెల్లించే పన్నులను ఐదేళ్లకు ఒకసారి కట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అఖిల భారత బెస్త మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీటీ సాయి ప్రదీప్, నాయకులు ముని, రమేష్, తెలుగు వెంకటేశ్వర్లు, సిద్దప్ప, శ్యాం, పవన్ తదితరులు పాల్గొన్నారు.

బెస్త వర్గీయుల నిరసన


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బెస్త కులస్తులు

కర్నూలు(సెంట్రల్): బెస్త కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇతర కులానికి చెందిన వారికి కేటాయించడంపై జాతీయ మత్స్యకారుల సంఘం భగ్గుమంది. తమ కులానికి చెందాల్సిన పదవిని, ఇతరులకు ఎలా కేటాయిస్తారని కూటమి ప్రభుత్వాన్ని బెస్త నాయకులు ప్రశ్నించారు. సోమవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట బెస్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం బెస్తలను అణగదొక్కే ప్రయత్నం చేస్తోందన్నారు. బెస్త కార్పొరేషన్ చైర్మన్ పదవిని ఇతర కులస్తులకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించినా పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. అలాగే బెస్త సామాజిక వర్గానికే ఏఎఫ్‌సీఓఎఫ్ పదవిని కేటాయించాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బెస్త నాయకులు హిందూపురం లక్ష్మీనారాయణ, బత్తిని రాధాకృష్ణ, మనోహర్, ఎద్దుల వెంకటేష్, రాఘవేంద్రుడు, కొతిమీర వెంకటేశ్వర్లు, సుబ్బయ్య, పుట్టా శివ, నంద్యాల రమేష్, రాజు, పీటీ సాయిప్రదీప్, గ్యాస్ శ్రీనివాసులు, చంద్రశేఖర్, పీజీ వెంకటేష్ పాల్గొన్నారు.

పన్నుల అవకతవకలను పరిష్కరించండి


ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): శ్రీరామ రెసిడెన్సీ ఓనర్స్ అసోసియేషన్ ప్లాట్లకు సంబంధించి ఖాళీ స్థల పన్నులు, ఇళ్ల పన్నుల అవకతవకలను త్వరితగతిన పరిష్కరించాలని అసోసియేషన్ ప్రతినిధులు కిష్టప్ప, అశోక్‌కుమార్ విన్నవించారు. సోమవారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదులను నిర్ణీత గడువులోపు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అదనపు కమిషనర్ ఆర్జీవీ క్రిష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎంఈ మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు ఇవే...

➤ టిడ్కో ఇళ్లలో బాత్‌రూమ్ ఫిట్టింగ్స్, డోర్ ఇన్‌స్టాలేషన్ పూర్తి చేయాలని ఎం.రమణమ్మ విన్నవించారు.

➤ బృందావన్ నగర్, రాజేశ్వర్ నగర్ ప్రాంతాల్లో 92 ప్లాట్లకు 60 అడుగుల రోడ్డు పూర్తి కాలేదని, వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని స్థానికులు మూర్తి, విజయ్‌లు అభ్యర్థించారు.

➤ జొహరాపురం ఇందిరమ్మ కాలనీలో మున్సిపల్ స్థలం ఆక్రమించడంతో పైపులైన్ పనులు ఆగిపోయాయని, అడ్డంకులు తొలగించి కొళాయి కనెక్షన్ ఇప్పించాలని స్థానికులు హబీబ్‌ఖాన్ ఫిర్యాదు చేశారు.

నిబంధనల మేరకే అనుమతులివ్వాలి


వీసీకి వినతి పత్రం ఇస్తున్న ఆర్‌పీఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ కళాశాలలకు నిబంధనల ప్రకారమే అఫ్లియేషన్ ఇవ్వాలని ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజ్ డిమాండ్ చేశారు. ఆర్‌పీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. బీఈడీ కళాశాలలతో వర్సిటీ అధికారులు లోపాయికారి ఒప్పందం చేసుకొని అనుమతులు ఇవ్వడం సరైంది కాదన్నారు. తూతూ మంత్రంగా వెరిఫికేషన్ చేసి అనుమతులు ఇస్తున్నారని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో కొన్ని కళాశాలలకు బిల్డింగ్‌లు లేకున్నా కేవలం అప్లికేషన్‌లో మాత్రమే బిల్డింగ్‌లు చూపి ఏదో ఒక కమర్షియల్ కాంప్లెక్స్‌లో ఆఫీస్ తీసుకొని అక్కడే అడ్మిషన్ల ప్రక్రియ మొదలు పెట్టి సంవత్సరం మొత్తం పూర్తి చేస్తున్నారని ఆరోపించారు. ఎన్‌సీటీఈ నిబంధనలు పాటించకుండా ఎలాంటి తరగతులు నిర్వహించకుండా కోర్సులు పూర్తి చేయిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై ఉన్నత విద్యా మండలికి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఆర్‌పీఎస్ఎఫ్ నాయకులు బాలాజీ, సాయి, వీరేంద్రబాబు, తదితరులు వీసీకి వినతి ప్రతం ఇచ్చినవారిలో ఉన్నారు.

గొలుసు చోరీ కేసులో అక్కాచెల్లెళ్ల అరెస్ట్



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు (టౌన్): కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో హడావుడిగా బస్సు ఎక్కే ప్రయాణికుల వద్ద బంగారు గొలుసు, బ్యాగ్‌లను కొట్టేసే అక్కాచెల్లెళ్లను ఆదివారం రాత్రి నాల్గవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సీఐ విక్రమసింహా వెల్లడించారు. ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 1 గంట సమయంలో జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్‌కు చెందిన పాగిడాల విమలమ్మ కర్నూలు బస్టాండ్‌లో ఆత్మకూరు బస్సు ఎక్కుతుండగా చేతి బ్యాగులో ఉన్న చిన్న పర్సు చోరీకి గురైంది. పర్సులో 4 తులాల బంగారు గొలుసు ఉండటంతో ఈ నెల 16న బాధితురాలు 4వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ విక్రమసింహా ఆధ్వర్యంలో ఎస్ఐ మోహన్ కిషోర్ రెడ్డి, మహిళా ఏఎస్ఐలు, క్రైం పార్టీ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ఈనెల 17న కొత్తబస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించి విచారించారు. వారు కర్నూలు వడ్డె గేరికి చెందిన షేక్ ఖాజాబీ, షేక్ ఫరీదా అనే అక్కాచెల్లెళ్లుగా తెలిసింది. బంగారు గొలుసును దొంగిలించినట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి గొలుసు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచినట్లు సీఐ వెల్లడించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు బహిరంగ ప్రదేశాలు, బస్టాండ్, రైల్వేస్టేషన్లలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులను గమనిస్తే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

3.32 లక్షల హెక్టార్లలో పంటల సాగు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పత్తి సాగు భారీగా పెరిగింది. ఖరీఫ్ సాధారణ సాగు 4.22 లక్షల హెక్టార్లు కాగా ఇప్పటివరకు 3,32,722 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 2,34,409 హెక్టార్లు ఉండగా ఇప్పటివరకు 2,14,378 హెక్టార్లలో సాగైంది. మిగతా అన్ని పంటలు కలిపి 1,18,344 హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయి. వేరుశనగ 27,751 హెక్టార్లు, ఆముదం 8,890, ఉల్లి 10,797, మిర్చి 5,538, టమాట 1,756, సజ్జ 3,488, మొక్కజొన్న 2,997 హెక్టార్ల ప్రకారం పంటలు సాగయ్యాయి.

జీఓ నంబర్ 23ను రద్దు చేయాలి


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఏపీటీడీసీ ఉద్యోగులు

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థలోని 22 హోటళ్లను ప్రైవేట్‌కు అప్పగించాలని పేర్కొంటూ విడుదల చేసిన జీఓ నంబర్ 23ను రద్దు చేయాలని కోరుతూ టూరిజం సంస్థ ఉద్యోగులు నిరసన చేపట్టారు. సోమవారం ఉమ్మడి జిల్లాలోని 8 యూనిట్లలో ఉద్యోగులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీటీడీసీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి వై.రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రస్తుత జీఓతో సంస్థను నమ్ముకొని రెండున్నర దశాబ్దాలుగా పనిచేస్తున్న వందలాది మంది ఉద్యోగులు రోడ్డున పడాల్సి వస్తుందన్నారు. ఎలాంటి ఉద్యోగ భద్రత లేకపోయినా, సరైన జీతాలు లేకపోయినా ప్రభుత్వ రంగ సంస్థలో పనిచేస్తున్నామనే ఆశతో జీవనం గడుపుతున్నామన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తమను క్రమబద్ధీకరించకపోగా సంస్థ మొత్తాన్ని ప్రైవేట్ వారికి అప్పగించేలా జీఓ తీసుకురావడం సరైంది కాదన్నారు. రూ.159 కోట్ల బ్యాంకు రుణం తీసుకొని సంస్థలోని హోటళ్లను మరమ్మతులు చేయించి ఆధునీకరించి ఇప్పుడు ప్రైవేట్ వారికి అప్పగించడం ఏంటని ప్రశ్నించారు. జీఓను రద్దు చేసి టూరిజం సంస్థ ఉద్యోగులను ఆదుకోవాలన్నారు. నాయకులు శ్రీనివాస్ యాదవ్, జాషువా, సుధాకర్, ఆంజనేయులు, సరిత, సుగుణాదేవి, జయరాం, ఎన్.రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నోట్లో ఏర్పడిన కణితి తొలగింపు

కర్నూలు(హాస్పిటల్): ఓ మహిళకు నోటిలో పై దవడలో ఏర్పడిన అరుదైన కణితిని విజయవంతంగా తొలగించినట్లు దంత వైద్యులు డాక్టర్ లక్కిరెడ్డి అమరసింహారెడ్డి చెప్పారు. సోమవారం స్థానిక ఎన్ఆర్ పేటలోని లక్కిరెడ్డి సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాలలో ఆయన చికిత్స వివరాలు వెల్లడించారు. తెలంగాణా రాష్ట్రం శాంతినగర్‌కు చెందిన తాహెరాబేగం (31)కు గత 8 నెలలుగా నోటి పై దవడలో ఏర్పడిన గడ్డతో ఇబ్బంది పడుతూ చికిత్స కోసం వచ్చిందన్నారు. ఆమెకు సీటీ స్కాన్, బయాప్సీ పరీక్షలు నిర్వహించి చాలా అరుదుగా నోటి పై దవడలో ఏర్పడే ప్లీమోర్ఫిక్ అడెనోమోగా నిర్ధారించుకుని ఆదివారం శస్త్రచికిత్స నిర్వహించి కణితిని తొలగించినట్లు చెప్పారు. ఇది నొప్పి లేకుండా ఉంటుందని అయితే అసౌకర్యంగా ఉంటుందన్నారు. నిర్లక్ష్యం చేస్తే ఒక్కోసారి క్యాన్సర్‌గా మారే అవకాశం ఉందని చెప్పారు.

డీసీసీబీ విశ్రాంత ఏజీఎం మృతి


కర్నూలు (అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పని చేసి పదవీ విరమణ చేసిన రామ్మోహన్ సోమవారం మరణించారు. ఈయన ఈ ఏడాది ఫిబ్రవరిలో పదవీ విరమణ చేశారు. అనారోగ్య కారణాలతో కర్నూలులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. విశ్రాంత ఏజీఎం రామ్మోహన్ మృతి పట్ల డీసీసీబీ సీఈఓ పి.రామాంజినేయులు, డీజీఎంలు ఉమామహేశ్వర రెడ్డి, సునీల్‌కుమార్, ఏజీఎం త్రినాథ్ రెడ్డి ప్రగాఢ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి


ధర్నా చేస్తున్న బీఎస్పీ నేతలు

కర్నూలు(సెంట్రల్): సమాజంలోని బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి మంచాల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీసీ సామాజిక వర్గాలను అన్ని రాజకీయ పార్టీలు ఓట్లు వేసే యంత్రంగా వాడుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన ఆర్టికల్ 340 ప్రకారం బీసీల అభ్యున్నతి కోసం చర్యలు తీసుకోవాలని 1953లో కాకా కాలేల్కర్ కమిషన్, 1978లో మండల్ కమిషన్‌లు వేసి ఇచ్చిన నివేదికలను బుట్టదాఖలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ బొగ్గుల వనమన్న, అరుణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సామేలు, ఉపాధ్యక్షుడు బోయ రికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యునాని మెడికల్ కాలేజీ అభివృద్ధికి కృషి


యునాని మెడికల్ కాలేజీ అధ్యాపకులతో వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలో ఏకైక యునాని మెడికల్ కాలేజీ కర్నూలులో ఉందని, అలాంటి కళాశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ చెప్పారు. ఆయన సోమవారం కర్నూలులోని డాక్టర్ అబ్దుల్ హక్ యునాని మెడికల్ కాలేజీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కళాశాలలో 50 మెడికల్ సీట్లు ఉండగా ప్రస్తుతం అన్ని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, త్వరలో 25 సీట్లు మేనేజ్‌మెంట్ కోటాకు ఇచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. పీజీ సీట్లు సైతం తీసుకొస్తానని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మెడికల్ కళాశాలల్లో పరిశోధనల కోసం రూ.10 కోట్ల నిధులు విడుదల చేశామన్నారు. ఈ సందర్భంగా కళాశాలలోని సమస్యలను ప్రిన్సిపాల్ డాక్టర్ జైన్‌ముల్ హబిద్ ఆయన దృష్టికి తెచ్చారు.

రెవెన్యూ ఉద్యోగులకు మెమోలు

కర్నూలు (టౌన్): విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించిన నగరపాలక రెవెన్యూ ఉద్యోగులకు కమిషనర్ పి.విశ్వనాథ్ సోమవారం మెమోలు జారీ చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఖాళీగా ఉన్న, పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ షాపులు, జొహరాపురం వద్ద ఉన్న షటిల్ కోర్టు, ఇండోర్ స్టేడియం తదితర వాటికి వేలాలు నిర్వహించాలని నిర్ణయించారు. తద్వారా నగరపాలక రెవెన్యూ విభాగానికి ఆదాయం సమకూరుతుంది. అలాగే రెవెన్యూ విభాగంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలోనూ ప్రతిసారి వేలాల గురించి కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అయినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా రెవెన్యూ ఉద్యోగులు స్పందించలేదు. దీంతో ఈ విభాగం పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్ రెవెన్యూ అధికారి కేఎండీ.జునీద్, సూపరింటెండెంట్ టి.అబ్దుల్ వాజీద్, జీ.సుహేయిల్ అహమ్మద్ (సీనియర్ అసిస్టెంట్, ఏ1) లకు మెమోలు జారీ చేశారు. రెండు రోజుల వ్యవధిలో వేలాలకు సంబంధించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. సకాలంలో వేలాలు నిర్వహించకపోవడం వల్ల నగరపాలక సంస్థకు నష్టం వాటిల్లిందని, దీనిపై మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలన్నారు. లేని పక్షంలో ఆదాయాన్ని నష్టపరిచినందుకు ఏపీసీఎస్ యాక్ట్ 1991 ప్రకారం శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

పీజీఆర్ఎస్ డుమ్మా కొట్టిన అధికారులకు నోటీసులు?

నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో సెక్షన్ హెడ్‌లు డుమ్మా కొట్టడంపై కమిషనర్ పి.విశ్వనాథ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సెక్షన్ హెడ్‌లు సెలవు పెట్టినా తనకు తెలియజేయకపోవడంపై మండిపడ్డారు. చెప్పకుండా సెలవుల్లో పోవడం, కింది స్థాయి ఉద్యోగులను పంపించడమేంటని విస్తుపోయారు. కాగా మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ఇన్‌చార్జ్ ఎస్ఈ శేషసాయి, సిటీ ప్లానర్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాలేదు. వారిరువురు సెలవు పెట్టినట్లు తెలుసుకున్న కమిషనర్ తనకు తెలియకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నాటి గురువులతో కేఎంసీ పూర్వ విద్యార్థులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో పాతికేళ్ల క్రితం (2000 బ్యాచ్) ఎంబీబీఎస్ చదువుకున్న విద్యార్థులు సోమవారం తిరిగి సమావేశమయ్యారు. అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులు గిడ్డయ్య, సుధాకర్‌రావు, కె.చిట్టినరసమ్మ, కె.వెంకటేశ్వర్లు, భవానీప్రసాద్, విష్ణుప్రసాద్, శ్రీరాములు, బాలీశ్వరి తదితరులను ఘనంగా సన్మానించారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. అప్పట్లో జరిగిన సంఘటనలను ఒక్కొక్కరుగా వేదికపైకి వచ్చి గుర్తు చేసుకుని ఆనందించారు. అప్పట్లో విద్యార్థులుగా ఉన్న వారు కొందరు ప్రైవేటు వైద్యులుగా, మరికొందరు స్పెషలిస్టులుగా, మరికొందరు సూపర్ స్పెషలిస్టులుగా, వివిధ స్థాయిల్లో ప్రభుత్వ అధికారులుగా ఉంటూ సేవలందిస్తుండం ఎంతో సంతోషాన్నిస్తోందని చెప్పుకొచ్చారు. పూర్వవిద్యార్థులు డాక్టర్లు ప్రశాంత్, జాన్, శివబాల నాగాంజన్, ఫణికిశోర్, రాఘవ, సుబ్బారెడ్డి, అర్చన, హేమలత తదితరులు పాల్గొన్నారు.

24న సాంస్కృతిక అంశాలపై విద్యార్థులకు పోటీలు

కర్నూలు కల్చరల్: శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో ఈ నెల 24న ఉదయం 9 గంటలకు నగర శివారులోని క్రెడో ది స్కూల్‌లో విద్యార్థులకు సాంస్కృతికాంశాలపై పోటీలు నిర్వహించనున్నట్లు సమితి నగర అధ్యక్ష కార్యదర్శులు రంగస్వామి, గిరిరాజ్‌వర్మ తెలిపారు. వ్యాసరచనలో 5వ తరగతి విద్యార్థులకు 'ఆయుర్వేద జీవన విధానం', 6వ తరగతి విద్యార్థులకు 'ఉపనిషత్తులలోని ఏవైనా రెడ్డి సంవాదాలు', 7వ తరగతి విద్యార్థులకు 'నారీ శక్తి – స్వాతంత్ర్య పోరాటంలో యువతుల పాత్ర', 8వ తరగతి విద్యార్థులకు 'ఆపరేషన్ సింధూర్', '9వ తరగతి విద్యార్థులకు 'భారత సాంస్కృతిక వైభవం – ధర్మ భూమి, కర్మ భూమి, జ్ఞాన భూమి', 10వ తరగతి విద్యార్థులకు 'స్వదేశీ, స్వావలంబన్ భారత్' అనే అంశాలపై పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

వక్తృత్వానికి సంబంధించి 5వ తరగతి విద్యార్థులకు 'విద్యార్థులకు ఉపయోగపడేలా ఏదైనా ఒక సుభాషితం, భావం', 6వ తరగతి విద్యార్థులకు 'పంచతంత్రం కథలు ఎన్నిరకాలు – వాటి వల్ల కలిగే లాభాలు', 7వ తరగతి విద్యార్థులకు 'షోడశ సంస్కారాలు – వాటి ఆవిశ్యకత', 8వ తరగతి విద్యార్థులకు 'షాధన చతుష్టయం', 9వ తరగతి విద్యార్థులకు 'యోగా వల్ల విద్యార్థులకు కలిగే లాభాలు', 10వ తరగతి విద్యార్థులకు 'విజయం కోరుకొనే విద్యార్థులకు ధృవజ్ఞానం ఆవశ్యకత' అనే అంశాలపై పోటీలు ఉంటాయని తెలిపారు.

అలాగే 4వ తరగతి విద్యార్థులకు మట్టి వినాయకుల తయారీ పోటీలు, చిత్రలేఖన పోటీలకు సంబంధించి 'విజయ గణపతి రూపం'పై పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పాఠశాల యాజమాన్యాలు ప్రతి తరగతి నుంచి ఐదుగురు విద్యార్థులను ఒక్కో అంశానికి సిద్ధం చేసి పంపాలని విజ్ఞప్తి చేశారు. విజేతలకు అక్కడే బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థుల కోసం 24వ తేదీ ఉదయం 8.30 గంటలకు వినాయక ఘాట్ నుంచి పోటీలు నిర్వహించే పాఠశాలకు బస్సు సౌకర్యం ఉంటుందని చెప్పారు. వివరాలకు మాకా నాగరాజు – 99664 96724, మామిళ్లపల్లి రాజేష్‌శర్మ – 94929 42544, డాక్టర్ చెన్నయ్య – 94407 69600, చింతలపల్లి రామకృష్ణ 99495 66999 నంబర్లను సంప్రదించాలని సూచించారు.